# మనిషి - యంత్రము

## కొణతాలపల్లి సీతారామారావు

సాయంత్రం ఆరు గంటలయింది. ఆఫీసు పని ముగించుకొని కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి చేరాను.

ఇల్లు బయట గడియపెట్టి ఉంది. ఎక్కడికి వెళ్ళారబ్బా మా బాల రాక్షసులూ, వారి కన్న తల్లీ అనుకుంటుండగానే బిలబిలమంటూ అంతా ఎదురింట్లోంచి వచ్చారు. లోపలికి వెళ్తూనే పడక్కుర్చీలో అలసిపోయిన శరీరాన్ని కూలేశాను.

"ఎదురింట్లో ఆంటీవాళ్ళు మిక్సీ కొనుక్కున్నారు మనం కూడా కొనుక్కుందాం నాన్నా! బలె బాగుంది" అంటూ నా మెడ చుట్టూ చేతులు వేసింది మా ఆఖరిది. ఎనిమిదేళ్ళు దానికి. గారాబం కొద్దీ నా మీద దానికాస్త అధికారం ఎక్కువ.

"ఓ! అలాగే కొందాం. కాని దానివల్ల లాభంతో పాటు ఎన్నో నష్టాలు కూడా ఉన్నాయి." అన్నాను. యీ మాటలకర్థం దానికి తెలియదని నాకు తెలిసీ కూడా.

"అదుగో నాన్నగారు కొత్త కథ మొదలుపెట్టారు. అందరూ శ్రద్ధగా వినండి"— అతి క్రూరంగా జోక్ చేశాడు పుత్రరత్నం పదేళ్ళవాడు.

వాళ్ళు ఎక్కడ ఏ కొత్త వస్తువు చూసినా, నన్ను కొనమని అడగటమూ, నేను ఆ వస్తువు మంచి చెడుల గురించి, లాభనష్టాల గురించీ కథలుగా చెప్పి, ఓవరకు కొనకుండా ఉండటానికి అనేక కారణాలు చూపించటం మాకు మామూలే.

నిజానికి నాకు కొనగల స్తోమత ఉన్నా



లేకపోయినా నాకెందుకో ఇప్పుడు ఇళ్ళలో కనిపించే కొన్నికొన్ని ఆధునిక పరికరాలు చూస్తుంటే మనం పురోగమిస్తున్నామా, తిరోగమిస్తున్నామా అని అనుమానం వస్తుంటుంది.

ఈమాటే ఎప్పుడన్నా మా ఆవిడ సుందరితో అన్నానో, మూతి మూడుసార్లు విరిచి ఆడలేక మద్దెల ఓడన్న సామెత అసలు మిమ్మల్ని చూసే చెప్పారేమో అంటుంది. ఇక నోరుమూసుకోక తప్పదు నాకు. ఆలోచిస్తూ కొంచెం కళ్ళుతిరిగినట్లై అలసటగా వెనక్కి జారగిలబడ్డాను....

కళ్ళు తెరిచి చూసేసరికి హాస్పిటల్‌లో బెడ్ మీద ఉన్నాను. ప్రక్కనే సుందరి కళ్ళనీళ్ళతో కూర్చుని ఉంది.

"అకస్మాత్తుగా పడిపోయారు. ఆలోచనలు ఎక్కువవడం వల్ల జరిగింది. మరేం ఫర్వాలేదన్నారు డాక్టరుగారు. ఏమీ ఆలోచించకుండా పడుకోండి" అన్నది ఆప్యాయంగా చేయి నిమురుతూ.

ప్రక్క గదిలోంచి డాక్టరుగారి మాటలు కాబోలు వినిపిస్తున్నాయి.

"ఏం అమ్మా ఏవిటి జబ్బు?"

"నా మోచేతులు ఎందుకో బాగా వంగడంలేదండీ! చేతుల్లో నరాలన్నీ ఎక్కడికక్కడ బిగుసుకుపోతున్నట్లనిపిస్తున్నది!"

"ఇంట్లో వంట నువ్వే చేస్తావా అమ్మా?"

"అవునండీ."

"పప్పురుబ్బటం, తిరగలి విసరటం లాంటి పనులేవైనా చేస్తావా?"

"లేదండీ! మాకు వెట్ గ్రైండర్, మిక్సీ అన్నీ ఉన్నాయి."

ఉలిక్కిపడ్డాను. ఇక్కడా అదే గోలా.

"బట్టలుతుకుతావా?"

"అక్కర్లేదండీ! వాషింగు మెషీను ఉంది"

ఆమె కంఠంలో కొంచెం చిరాకు ధ్వనించింది.

డాక్టరు తన ప్రశ్నల పరంపర కొనసాగిస్తూ అడిగాడు.

"చేతులకేమైనా అధికశ్రమ కలిగే పనులేవైనా...."

ఆమె ఇక భరించలేనట్లుగా అంది.

"నా కసలు మోటుపనులు చేసే అవసరమే లేదండి. మాకు గ్యాస్, ప్రెషర్ కుకర్, గీజర్, గ్రైండర్ అన్నీ ఉన్నాయి" స్వరంలో గర్వం పలుకుతుండగా.

"ఆ! సరిగ్గా అదేనమ్మా నీ జబ్బు. మన శరీరంలో ప్రతి అవయవానికీ ఒక నిర్దిష్టమైన పని ఉంది. ఆ పని వాటిచేత చేయించకపోతే కాలక్రమేణా ఆ అవయవాలకు ఆ పని




చేసే సామర్థ్యం నశిస్తుంది. నీ చేతులకు తగినంత పనిలేకపోవటమే నీ బాధకి కారణం" కంచు కంఠంలా మోగింది డాక్టరు గొంతు.

ఆమె ఖంగుతిని ఉండాలనిఅనుకున్నాను. కొంచెం నసుగుతూ అన్నట్లుగా అంది. "మరయితే ఏదైనా మంచి మందులు వ్రాసిస్తే...."

"వేరే ఏమీ మందులు అక్కర్లేదమ్మా! మామూలుగా మనం వాడేవే. రోజూ మీ యింటిల్లిపాదీ ఇడ్లీ, దోశె తినండి. అయితే ఒక్క నిబంధన. దానికి కావలసిన పప్పు మాత్రం నువ్వే స్వయంగా రుబ్బాలి. టానిక్‌లా ఇంకా ఏమైనా కావాలంటే రోజూ బట్టలు కూడా నువే వుతుకు. అప్పు డప్పుడు అంట్లు కూడా తోముతూ వుంటే ఇంకా మంచిది."

ఇదంతా వింటుంటే నాకు ఆవేశం పొంగుకొస్తున్నది. 'ఆహా! ఎన్నాళ్ళకు చూశాను ఒక గొప్ప డాక్టరును! వెంటనే ఆయనను దర్శించి పాదాభివందనం చేయాలి' –లేవబోయాను. సుందరి ఖంగారుగా చూస్తూ బలవంతాన నన్ను పడుకోబెట్టింది.

మరో పేషెంటు వచ్చినట్లుంది. ఈసారి మగ పేషెంటు కాబోలు.

"చెప్పండి మిస్టర్! ఏమిటి మీ ట్రబుల్" అడిగాడు డాక్టర్.

"మోకాళ్ళ వద్ద విపరీతమైన నొప్పి సార్! నాకింకా ముప్పై నిండలేదు. అప్పుడే ఈ మోకాళ్ళ నొప్పులేవిటో అర్థం కావటం లేదు."

"ఓ! అలాగా! మీరేం చేస్తుంటారు?"

"........ఆఫీసులో పన్చేస్తున్నానండీ."

"ఆఫీసు ఏ మాత్రం దూరం ఉంటుం దేవిటీ?"

"ఎంతండీ! అర కిలోమీటరు కన్నా తక్కువే."


"దగ్గరేనన్న మాట. నడిచే వెడతారా?"

"అబ్బే! అక్కర్లేదండీ! నడవాల్సిన పని లేదు. నాకు స్కూటరు ఉంది."

"ఏ కూరగాయల మార్కెట్టుకో, బజారు పనికో కాస్త ఏమైనా ఎక్కువగా నడవాల్సి వస్తుంటుందా?"

"నేనసలు కాలు కిందే పెట్టనండీ! అసలు స్కూటరు లేంది ఇంట్లోంచి బయటకే రాబుద్ధి కాదు నాకు. అయినా ఏవిటో యీ కాళ్ళ నెప్పులు. నాకింకా ముప్పై...."

"చూడండి మిస్టర్! మీ జబ్బేమిటో నాకు తేలిగ్గానే తెలుస్తోంది. మనకు భగవం

తుడు కాళ్ళచ్చింది నడవటానికి. ఎక్కువగా కాకపోయినా కనీసం నడక మర్చిపోకుండా ఉండటానికయినా. రోజూ నాలుగయిదు కిలోమీటర్లునడవడం అలవాటుచేసుకోండి."

"అంతేనంటారా ! ఇక వేరే మందులేమీ అక్కరలేదంటారా?"

"బై ది బై ! డైనింగు టేబులుమీద భోజనం చేయడం మానేసి క్రింద పీటమీద పొందికగా కాళ్ళు మడుచుకొని కూర్చోవడం అలవాటు చేసుకోండి. ఇది కూడా ఎంతో కొంత ఉపయోగపడకపోదు."

తరువాత కాస్త తగ్గుస్వరంతో మాట్లాడుతున్నాడు డాక్టరు. అయినా నాకు వినిపిస్తూనే వుంది.

"డబ్ల్యు. సి. లో మనసుపడి యూరోపియన్ టైపు కమోడ్ పెట్టించుకున్నారేమో! కాస్త వీలుంటే ఇండియన్ టైపుకు మార్పించుకోండి."

ఆ పేషెంటు దగ్గర్నుంచి మరి జవాబు లేదు. డాక్టరు పెట్టిన వాతలతో తల తిరిగిపోయి ఉంటుంది.

మరో కేసు మొదలైంది.

"డాక్టర్! ఐ యామ్ ఛార్టర్డ్ ఎకౌంటెంట్. నా కెందుకో ఈమధ్య నాలుగు నిమిషాలసేపు ఫిగర్ వర్క్ చేశానంటే తలపోటు వస్తున్నది మెదడంతా మొద్దుబారినట్లు అనిపిస్తున్నది. అసలు జ్ఞాపకశక్తే ఉండటంలేదు. మతిస్థిమితం తప్పేట్లుంది"

"ఐసీ. మీరేమైనా పాకెట్ కాలిక్యులేటర్లు వగైరా ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంటు ఉపయోగిస్తుంటారా?"

"చేస్తాం. తప్పదు కదండీ! ఎంతో ఎలాబరేట్ ఫిగర్‌వర్క్ ఉంటుంది."

"దై టీ! నేను కాదనడంలేదు. కాని మీరు రెండూ, మూడూ కూడటానికీ, నాలుగో ఎక్కం గుణించడానికీ కూడా కాల్క్యులేటర్లే వాడుతున్నారని నేనుగట్టిగా చెప్పగలను. ఫ్రాంక్‌గా చెప్పండి. యామై నాట్ కరెక్ట్?"

తెల్లబోయాడు ఛార్టర్డ్ ఎకౌంటెంట్. నిజమేననక తప్పలేదు.

"దటీజ్ ఇట్. అందుకే- ఎంతో పదునుగా వుండవలసిన మీ మెదడు పనిలేక అంతగా మొద్దుబారిపోయింది. ఇక మీరేం చేయవలసినదీ నేను చెప్పనక్కరలేదనుకుంటాను."

వచ్చిన పేషంట్లందరికీ ఇలాంటి సలహాలే యిస్తున్నాడు డాక్టర్. ఎవరికీ ఒక్క ప్రిస్క్రిప్షను వ్రాసినట్లు అనిపించడం లేదు.

"తల తిరుగుతున్నట్లుంటుంది డాక్టర్."

"ఇంట్లో సీలింగుఫానులు, టేబుల్ ఫ్యానుల వాడకం తగ్గించండి. ఆరుబయట గాలిలో పడుకోండి. అదే తగ్గిపోతుంది".

"కళ్ళు మసకమసకగా వున్నాయండి. చూపు సరిగ్గా ఆనడంలేదు."

"సినిమాలు మానేయండి. అలాగే ఇండియాలో టీ.వీ. కూడా చూడకండి."

"చెవులలో ఎప్పుడూ హోరెత్తుతున్నట్లుగా అనిపిస్తుంటుంది సార్."

"ఇరవై నాలుగ్గంటలూ ట్రాన్సిస్టర్లూ, టేపురికార్డర్లూ మీ చెవి దగ్గరే ఉంటాయని నేను చూడకుండానే చెప్పగలను. అవి వినడం కాస్త తగ్గించండి. అంతకంటే మందేమీ లేదు."

"ముక్కుకు వాసన తెలియట్లేదు డాక్టరు గారూ!"

"సెంట్లు, పర్‌ఫ్యూమ్‌లు కాస్త తగ్గించి చూడండి."

"నా నాలుకకు రుచి తెలియట్లేదు."

"కాఫీలూ, సిగరెట్లూ మానేస్తే సరి."

"చర్మంమీద ఎప్పుడూ ఒకటే దురద"

"వేరే ఏంలేదు, పాలీస్టరు బట్ట మానేసి నూలు బట్టలు తొడుక్కోండి."

ఈ సలహాలన్నీ వాళ్ళు ఆచరిస్తారా అని ఆశ్చర్యపోతున్నాను నేను. ఇంతలో పేషెంట్లందరూ ఒక్కసారిగా పగలబడి నవ్వుతున్నట్లు వినిపించింది. డాక్టరు ఏదో అంటున్నాడు. ఎవరూ వినిపించుకోవడం లేదు. పిచ్చివాడిని చూసినవ్వినట్లు నవ్వుతున్నారు నాకు రక్తం మరిగిపోతున్నది. డాక్టరు పిచ్చివాడు కాదు కాదు అని గొంతు చించుకొని అరవాలనిపిస్తున్నది. "కాదు ! కాదు!" అని అరిచాను బిగ్గరగా.

"ఏవిటి అలా గావుకేకలు పెడ్తున్నారు? మాట్లాడుతూమాట్లాడుతూనే కునుకుతీసింది కాక, వేళగాని వేళ కలవరింతలు కూడానా? లేచి స్నానం చేయండి. భోంచేద్దురుగాని" సుందరి గట్టిగా తట్టి లేపుతున్నది.

కళ్ళు తెరచి చూశాను. వాస్తవంలోకి ఊడిపడ్డాను. "అవును సుందరీ! కలలో ఒక గొప్ప వైద్యుడు కనిపించాడు. అతడిని అనవసరంగా అందరూ గేలిచేస్తున్నారు."

"సైన్సు ఎంతగా అభివృద్ధి చెందినా, సైన్సు సాధించిన ఫలితాలను మానవుడు తన చెప్పుచేతల్లో ఉంచుకుంటేనే వాటి ఉపయోగం, గొప్పతనం తెలుస్తుంది. మానవుడి ప్రగతికి అవి ఎంతో తోడ్పడతాయి. కాని ఆ ఫలితాలకు మానవుడు ఎప్పుడు లొంగిపోతాడో, అప్పుడే తిరోగమనం మొదలవుతుంది. వాటికి బానిసగా మారగానే పరాజయం పూర్తి అవుతుంది."

"మనిషి యంత్రాన్ని నడిపించాలిగాని, యంత్రం మనిషిని నడిపించే పరిస్థితి రాకూడదు. మనకు అవసరమైనంత వరకు యాంత్రిక సహాయం పొందవచ్చును. కాని మితిమీరి కాదు. అలాగే అలవాట్లు కూడా. ఎంత ఆధునికీకరణ జరిగినా మనిషి మనిషిగా సహజమైన మనుగడ జరపగలగాలి."

ఓపిగ్గా విని సుదీర్ఘంగా నిట్టూర్చింది సుందరి. "ఈ ఉపన్యాసం అంతా పిల్లలు మిక్సీ కొనమన్నందుకేనా బాబూ?"

దెబ్బతిన్నాను నేను. "హుం. నీకీ జన్మలో అర్థం కాదు. నీదీ బానిస మనస్తత్వమే" అన్నాను కసిగా, అప్పటిదాకా ఆలోచించిన మనిషినీ యంత్రాన్నీ మనసులో పెట్టుకొని.

"అవును. మిమ్మల్ని చేసుకున్నాకనే బానిస బ్రతుకైంది" వాడిగా జవాబిచ్చింది సుందరి.

మరి మాట్లాడలేదు నేను.

వివాహాది శుభకార్యములకు
కావలసిన అన్నిరకముల
సిల్కు చీరెలు, నేత చీరెలు
సూటింగ్స్ & షర్టింగ్స్
లభించు
శుభమంగళ వస్త్రాలయం!
పెండ్లి పట్టుచీరెలు
మా ప్రత్యేకత!
నేడే దయచేయండి!
సుమంగళి
టెక్స్‌టైల్స్
అన్ని రకముల పట్టు చీరెల A.C విభాగము
31, గాంధీరోడ్, తిరుపతి.
Ph: 2198
BABU ADS.